క్లుప్తంగా

వీరభద్రస్వామికి రుద్రాభిషేకం



రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు

రాయచోటి టౌన్ : రాయచోటి భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి అత్యంత భక్తి శ్రద్ధలతో రుద్రాభిషేకాలు నిర్వహించారు. స్థానిక భక్తులతో పాటు కర్నాటక, మహారాష్ట్రకు చెందిన 675 మంది రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి 11 గంటల వరకు మూడు విభాలుగా వివిధ దశలుగా నిర్వహించారు. స్వామివారికి రుద్రాభిషేకంతో పాటు శ్రీ భద్రకాళి అమ్మవారికి కుంకమార్చన కూడా నిర్వహించారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్య స్వామి, కృష్ణయ్యస్వామి, శేఖర్ స్వామి, రాచరాయ యోగీ స్వామి, మల్లికార్జున స్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందించారు. ఆలయంలో ప్రతి రోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి అన్నప్రసాదాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఒంటిమిట్టలో కార్డన్ సెర్చ్



దుకాణంలో తనిఖీ చేస్తున్న సీఐ, పోలీసులు

ఒంటిమిట్ట: జెడ్పీటీసీ ఉప ఎన్నిక నేపథ్యంలో మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో మంగళవారం సీఐ టి. బాబు ఆధ్వర్యంలో సాయుధ పోలీసు బలగాలు ఫ్లాగ్ మార్చ్, కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఈనెల 12న ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నిక నేపథ్యంలో మండలంలోని చింతరాజుపల్లి, గాండ్లపల్లి, బోయపల్లి సమస్యాత్మక గ్రామాల్లో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు కడప సబ్ డివిజనల్ పోలీసు ఆఫీసర్ ఎ వెంకటేశ్వర్లు ఉత్తర్వుల ప్రకారం సాయుధ బలగాలతో పోలీసు అధికారులు ఫ్లాగ్ మార్చ్, కార్డన్ సెర్చ్ నిర్వహించారన్నారు. ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రజలకు భరోసా కల్పిస్తూ చింతరాజుపల్లి, గాండ్లపల్లి, బోయపల్లి గ్రామాలలో కవాతు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ పార్టీ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్ఐ రవీంద్రబాబు

లక్కిరెడ్డిపల్లి: ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ రవీంద్రబాబు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక విశ్వభారతి పాఠశాలలో ట్రైనీ ఎస్ఐ సుష్మితతో కలిసి ఆయన విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవీంద్రబాబు మాట్లాడుతూ ఎక్కడైనా ఆడపిల్లలను ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే స్కూల్ మేనేజ్‌మెంట్, పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం ట్రైనీ ఎస్ఐ సుష్మిత మాట్లాడుతూ ఎవరైనా ఆడపిల్లలను ఆటపట్టించడం లేదా ఆడపిల్లలకు 18 సంవత్సరాలు వయస్సు పూర్తి కాకముందే పెళ్లి చేయడానికి ప్రయత్నిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరు 1098కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఆర్. రామచంద్రయ్య, కరస్పాండెంట్ కె. రఘునాథరాజు, హెడ్‌మాస్టర్ గంగాధర్ రాజు, రవీంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం.. అధైర్య పడొద్దు



రామకృష్ణారెడ్డి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న దేవనాథరెడ్డి

చిన్నమండెం : పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని, అధైర్య పడొద్దని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పి.దేవనాథరెడ్డి భరోసా ఇచ్చారు. చిన్నమండెం మండలం మల్లూరు గ్రామం బెల్లంవాండ్లపల్లెకు చెందిన పార్టీ రామకృష్ణారెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న దేవనాథరెడ్డి ఆయన భౌతికకాయానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రామకృష్ణారెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

గంజాయికి బానిసలు కావద్దు

గుర్రంకొండ: గంజాయి మత్తుకు విద్యార్థులు బానిసలు కావద్దని ఎస్ఐ రఘురామ్ అన్నారు. మంగళవారం స్థానిక తెలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మత్తుపదార్థాల వినియోగం – వాటి అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రమశిక్షణతో నడుచుకోవాలని సూచించారు.

చవితికి సిద్ధమవుతున్న గణనాథుడు

- వినాయక ప్రతిమల తయారీలో రాజస్తాన్ కళాకారులు
- ఆధునిక డిజైన్లతో ఆకట్టుకునే విధంగా తయారీ
- విగ్రహాలకు అడ్వాన్స్‌లు ఇచ్చి వెళ్తున్న నిర్వాహకులు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

రాయచోటి జగదాంబసెంటర్ : బొజ్జగణపయ్య చవితి వేడుకలకు సిద్ధమవుతున్నాడు. పిల్లా–పెద్దా అందరూ కలిసి ఆనందంగా జరుపుకునే పండుగల్లో వినాయకచవితి ఒకటి. ఆ వినాయకుడి పూజకు ప్రధానంగా కావాల్సింది ప్రతిమలే. గృహాల్లో మట్టి గణపయ్యను పెట్టుకుని వ్రతాన్ని పూర్తి చేసుకున్నా మండపాలు కట్టి ఐదు లేక తొమ్మిది రోజుల పాటు పూజలు చేయాలనుకునేవారు ఖచ్చితంగా పెద్ద విగ్రహాల కొనుగోళ్లపైనే దృష్టిసారిస్తారు. ఈనెల 27న వినాయకచవితి పర్వదినం సందర్భంగా పూజలు అందుకునేందుకు గణనాథుల ప్రతిమలు సిద్ధమవుతున్నాయి. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా వాడవాడలా గణపతి నవరాత్రులు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నారు.

పలు ఆకృతుల్లో ప్రతిమలు

ఈ ఏడాది వినాయక ప్రతిమల తయారీ పెరిగింది. గతంలో విగ్రహాల తయారీ కంటే ఈ ఏడు జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో నాలుగు ప్రాంతాల్లో విగ్రహాల తయారీని నిర్వాహకులు చేపట్టారు. వినాయక ప్రతిమల తయారీ కేంద్రంలో విభిన్నమైన ఆకృతుల్లో దర్శనమిస్తున్నారు. భక్తులను ఆకట్టుకునే విధంగా పలు రకాల ఆకృతుల్లో విగ్రహాలను రూపొందిస్తున్నారు. వీటికి రంగులు వేసి ఆకర్షణీయంగా సిద్ధం చేస్తున్నారు. 3 అడుగుల నుంచి 13 అడుగుల భారీ విగ్రహాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. వీటి ధర రూ.3 వేల నుంచి రూ.30 వేల వరకు ఉంది. గణేష్ ఉత్సవాలకు కొద్దిరోజులే సమయం ఉండటంతో విగ్రహాలను కొనుగోలు చేసేందుకు మండపాల నిర్వాహకులు క్యూ కడుతున్నారు. ఆకర్షణీయమైన విగ్రహాలను ముందస్తుగా బుక్ చేసుకుంటున్నారు.

ఆకర్షణీయమైన రంగులపై ఆసక్తి

ఉత్సవ కమిటీ ప్రతినిధులు తమ ప్రాంతాల్లో నెలకొల్పే వినాయక ప్రతిమలు ఆకర్షణీయంగా ఉండేందుకు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. కంప్యూటర్ గ్రాఫిక్స్ ద్వారా విగ్రహాన్ని రూపొందించి రంగులు వేసి చూసుకుని తరువాత కళాకారులతో ఆకర్షణీయంగా తయారుచేయిస్తున్నారు. విగ్రహం కొనుగోలు చేసే ఖర్చు కన్నా ఎక్కువ అవుతుంది. అయినా ఖర్చుకు వెనుకాడటం లేదు.



విగ్రహానికి మెరుగులు దిద్దుతున్న కళాకారుడు

డిమాండ్ ఉంది



చవితి ఉత్సవాలు చేసే వాళ్లు రంగుల విగ్రహాలను కొలువు తీర్చేందుకు ఇష్టపడతారు. విగ్రహాలను ఆకర్షణీయంగా, ప్రత్యేకతతో కూడిన విధంగా ఉంటే డిమాండ్ ఉంటుంది. మేం చిన్నతనం నుంచి విగ్రహాలు తయారు చేసే పనిలో ఉన్నాం.

– ప్రేమ్, విగ్రహ తయారీదారుడు

లాభాలు వస్తాయని ఆశిస్తున్నాం

గతేడాదితో పోలిస్తే అమ్మకాలు ఈ ఏడాది బాగుంటాయని భావిస్తున్నాం. ఇప్పటికే మండప నిర్వాహకులు పలువురు వచ్చి విగ్రహాలను చూసి వారికి నచ్చిన విగ్రహాలను బుక్ చేసుకుంటున్నారు. అందుకు తగ్గ రీతిలో మేము కూడా పలు రకాల ప్రతిమలను తయారుచేసే పనిలో నిమగ్నమయ్యాం. అన్ని అనుకూలిస్తే మంచి లాభాలు వస్తాయని ఆశిస్తున్నాం.

– హరీష్‌కుమార్, విగ్రహ తయారీదారుడు

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు

రాజంపేట రూరల్: ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు తెలిపారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం గాలి చంద్ర అధ్యక్షతన సీపీఐ నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి 12 వరకు మదనపల్లిలో నిర్వహించే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అదే విధంగా ఒంగోలులో ఈ నెల 20 నుంచి 25 వరకు నిర్వహించే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేసుకుందామని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని మండిపడ్డారు. దేశాన్ని, రాష్ట్రాన్ని కార్పొరేట్లను కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. సాధ్యం కానీ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం హామీల అమలుతో విఫలమైందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు పీ.మహేష్, టీ. రాధాకృష్ణ, జె. చిన్నయ్య, ఎం. శివరామకృష్ణదేవరా, డీ. రాజశేఖర్, నాగమ్మ, ఈ. సికింధర్ పాల్గొన్నారు. అనంతరం సీపీఐ నియోజకవర్గ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎం శివరామకృష్ణదేవరా, కార్యవర్గ సభ్యులుగా ఈ. సికింధర్, గాలి చంద్ర, కే. వెంకటయ్య, సర్తాజ్, శివయ్య, నాగేశ్వరరావు, నరసింహులు, మహమ్మద్, పవన్‌లతో పాటు 21 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

ఎంపీ మిథున్ రెడ్డి విడుదల కోసం పూజలు



ఆలయం వద్ద పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రామసముద్రం: ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అక్రమ అరెస్టు నుంచి విడుదల కావాలని మండలంలో వైఎస్సార్ సీపీ నాయకులు మినికి బండపై వెలసిన శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామికి పూజలు చేసి 101 కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన కొనసాగిస్తూ, వాటిని ప్రశ్నించే గొంతులను నొక్కేందుకు అక్రమ అరెస్టు లు చేయడం చాలా దారుణం అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కేశవరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి గెవన్న, మాజీ కన్వీనర్ భాస్కర్ గౌడ్, ఎంపీటీసీ దొడ్డిపల్లి ఆనంద, రెడ్డి శేఖర్, వైస్ ఎంపిపి రమణారెడ్డి, బీసీ సెల్ మండల కన్వీనర్ రెడ్డి వీరే గౌడు, మైనార్టీ నాయకులు మహబూబ్ బాషా, ఎస్సీ సెల్ అధ్యక్షులు కృష్ణప్ప, సర్పంచ్ జమున, శ్రీనివాసులరెడ్డి, నాయకులు సుబ్బారెడ్డి, వాసుదేవ రెడ్డి, సుజ్ఞాన మూర్తి, వేణుగోపాల్ రెడ్డి, గొల్లపల్లి నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

8న అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులు

పీలేరురూరల్ : శ్రావణమాసం పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 8న శుక్రవారం పీలేరు నుంచి అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డీఎం బి. నిర్మల తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పీలేరు ప్రాంత భక్తుల సౌకర్యార్థం రద్దీని బట్టి 5 నుంచి 10 బస్సు సర్వీసులు నడపడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో అనేక ప్రయోజనాలు



మాట్లాడుతున్న ఏడీఏ శివశంకర్

రాజంపేట రూరల్: ప్రకృతి వ్యవసాయంతో అనేక ప్రయోజనాలున్నాయని మాజీ ఐఏఎస్ అధికారి, టీ.విజయ్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని ఎర్రబల్లిలో డివిజనల్ వ్యవసాయ శాఖ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వీడియో ద్వారా టీ.విజయ్‌కుమార్ ప్రకృతి వ్యవసాయంపై వీఏఏలు, వీహెచ్ఎల్‌లకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు, పురుగుల మందులు వాడకుండానే సహజ సిద్ధమైన పద్ధతులతో సాగు చేయటం ద్వారా భూసారం పెరుగుతుందన్నారు. రసాయనాల వాడకంతో భూమిలో పోష్టిక విలువలు తగ్గిపోతున్నాయన్నారు. రసాయనిక, పురుగుమందులు వాడకంతో ఖర్చులు పెరుగుతాయని, భూమి కలుషితమవుతుందని, పండిన పంటలు ఆరోగ్యానికి హానికలిగిస్తాయని తెలిపారు. ఉప వ్యవసాయ సంచాలకులు శివశంకర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏ), హార్టికల్చర్ సహాయకులు (వీహెచ్ఏ) పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక మారెమ్మ జాతర

9 నుంచి ఉత్సవాలు



భక్తులకు దర్శనమిస్తున్న ముత్తుమారెమ్మ

నందలూరు : మండల కేంద్రంలోని అరవపల్లిలో వెలసిన ముత్తుమారెమ్మ జాతర మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ జాతర మహోత్సవాలకు రాయలసీమ నలుమూలల నుంచే కాక తమిళనాడు ప్రాంతాల నుంచి కూడా భక్తులు వస్తుంటారు. వంద సంవత్సరాల క్రితం తమిళ కుటుంబానికి చెందిన అంకయ్య, వీరస్వామి మొదలియార్‌లు ఈ ఆలయాన్ని ప్రారంభించారు. వారి మరణానంతరం వీరస్వామి మొదలియార్ కుమారుడు పొన్నుస్వామి మొదలియార్ ఆధ్వర్యంలో ఆలయం అభివృద్ధికి నోచుకోని భక్తజనుల ఆదరణ చూరగొంది. అంకయ్య మొదలియార్ జీవించి ఉండే కాలంలో హుబ్లీ నుంచి ముత్తుమారెమ్మ ఉత్సవ విగ్రహాన్ని తెచ్చి ఆలయంలో భక్తుల దర్శనార్థం ఉంచారు. ముత్తు అంటే ముత్యం.. అందువల్ల ఈ తల్లి ముత్యాల మారెమ్మగా కూడా పిలుస్తుంటారు. 3 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో తొలి రోజు అమ్మవారి ఊరేగింపు, సోదరుడు పోతురాజుతో పాటు మండల కేంద్రం ప్రధాన వీధుల్లో బాణసంచా పేలుళ్లతో, భజన కార్యక్రమంతో, మేళతాళాల వాయిద్యాల మధ్య ఘనంగా నిర్వహిస్తారు. హిందూ, ముస్లింల సహకారంతో జాతరను వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకుల ఏర్పాట్లు చేస్తున్నారు.

అమ్మపాలే బిడ్డకు అమృతం



ర్యాలీని నిర్వహిస్తున్న అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

వీరబల్లి: తల్లి పాలు బిడ్డకు అమృతం వంటివని అంగన్‌వాడీ పీడీ హైమావతి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో తల్లిపాలు వారోత్సవాల కార్యక్రమాన్ని మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ హైమావతి మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమైనవని, బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు తాపించాలని సూచించారు. తల్లిపాలు వలన వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. అనంతరం తల్లిపాలు వారోత్సవంలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయం నుండి ర్యాలీ నిర్వహించారు. సీడీపీఓ రాజమ్మ, సూపర్ వైజర్ సరస్వతమ్మ, తులసీ, సుశీల, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతం లాంటివి

పుల్లంపేట: తల్లిపాలు అమృతం లాంటివని సూపర్‌వైజర్ జయలక్ష్మీ పేర్కొన్నారు. తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా ఈనెల ఒకటో తేది నుంచి ఏడవ తేది వరకు తల్లిపాలు వారోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సూపర్ వైజర్ జయలక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, బి నాగలత, శ్రీలక్ష్మీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తల్లిపాలు విశిష్టత గురించి అవగాహన కల్పించారు.

ప్రతి ఇంటా కూటమి పాలనపై వ్యతిరేకత

రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి



బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

ఒంటిమిట్ట: కూటమి పాలనపై ప్రతి ఇంటా వ్యతిరేకత కనిపిస్తోందని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి తెలిపారు. ఎన్నికలకు సమయంలో ఇచ్చిన హామీల కోసం ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నా.. చంద్రబాబు మాత్రం వాటి ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. మంగళవారం మండలంలోని మలకాటపల్లి గ్రామంలో బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు ఏమేరకు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. పింఛన్, తల్లికి వందనం కొందరికే తప్పా.. ఏ పథకం అందడం లేదని మహిళలు తెలిపారు. 18 ఏళ్ల నిండిన మహిళలకు ఆడబిడ్డ నిధి క్రింద నెలకు రూ. 1,500, అన్నదాత సుఖీభవ, 50 ఏళ్లకే పింఛన్, ఫ్రీ బస్సు, విద్యార్థులకు వసతి దీవెన, విద్యా దీవెన పథకాలు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని ప్రజలకు ఆకేపాటి వివరించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో ప్రకృతి సంరక్షణ



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖాధికారి లక్ష్మీనారాయణ

రాయచోటి టౌన్ : సేంద్రియ సాగుతో భూసారాన్ని కాపాడుకోవడమే కాక ప్రకృతిని సంరక్షించుకోవచ్చునని అన్నమయ్య జిల్లా వ్యవసాయ శాఖాధికారి లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం రాయచోటి వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆర్ఎస్‌కే ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో జీవ వ్యవస్థను బలపడుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహార ఉత్పత్తులను తినడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయాన్ని బలోపేతం చేయాలని సూచించారు. రైతులు సేంద్రియ ఎరువులు వాడితే దిగుబడి పెరుగుతుందన్నారు. రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడుతుండటంతో భూమి బండబారి పోతోందని, నేలలోని మిత్ర పురుగులు కూడా చనిపోయి తెగుళ్లు ఎక్కువవుతున్నాయని వివరించారు. ఎప్పుడైతే రసాయన ఎరువులు తగ్గించి ప్రకృతి వ్యవసాయాన్ని అలవాటు చేసుకుంటారో పంటలు సమృద్ధి గా పండుతాయని వివరించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకట మోహన్, వీఏఏలు, వీఏహెచ్ఏలు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా మెరుగైన సేవలు



పుల్లంపేట: వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ జయశ్రీ



పెనగలూరు: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

పుల్లంపేట: వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని ఎంపీడీఓ జయశ్రీ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి పుల్లంపేట బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఇంటివద్ద నుంచి వాట్సాప్ ద్వారా సమస్యలను తెలియజేస్తే సమస్యలు పరిష్కరిస్తామని, ప్రతి ఒక్కరూ వాట్సప్ గవర్నెన్స్ గురించి అవగాహన పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ చక్రాధర్ రాజు, ఏఓ శ్రీధర్ రెడ్డి, ఏపీఓ శ్రీనివాసులు, ఈఓపిఆర్‌డీ ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్‌ను వినియోగించుకోవాలి

పెనగలూరు: వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ విజయారావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన పెనగలూరులో వాట్సాప్ గవర్నెన్స్‌పై భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినెల 5వ తేదిన అన్ని సచివాలయాల్లో వాట్సాప్ గవర్నెన్స్‌పై ర్యాలీ నిర్వహించబడుతుందని వారు తెలిపారు. ఈ వాట్సాప్ ద్వారా ప్రజలకు కావాల్సిన అన్ని రకాల సేవలను ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా ఇంటి దగ్గర నుంచే వారికి కావాల్సిన సేవలు పొందవచ్చని తెలియజేశారు. అలాగే మొబైల్‌లోనే దరఖాస్తు చేసుకునే సదుపాయం కల్పించారని పేర్కొన్నారు. అనంతరం పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నిరంజన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయకుంటే ఉద్యమం



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

రైల్వేకోడూరు అర్బన్: స్మార్ట్ మీటర్లు రద్దు చేయకుంటే మరో ఉద్యమం చేపడుతామని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్ హెచ్చరించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెనక్కు తీసుకోవాలని మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు విద్యుత్ సంస్థలను ధారాదత్తం చేస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రెండు కోట్ల విద్యుత్ కనెక్షన్లను అదానీ సంస్థకు అప్పగించి యూనిట్ విద్యుత్ ఛార్జీ రూ.7లకు విక్రయించడానికి 25 సంవత్సరాలు అగ్రిమెంట్ చేసుకున్నారని, దీని వలన సంవత్సరానికి 76 వేల కోట్ల రూపాయలు అదనపు భారం ప్రజలపై పడుతుందని అన్నారు.

కెరీర్ గైడెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మదనపల్లె సిటీ: కెరీర్ గైడెన్స్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఏస్ అకాడమి డైరెక్టర్ అర్జున్‌ఖాత్రా అన్నారు. మంగళవారం చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గేట్ పరీక్ష ద్వారా ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు, రీసెర్చ్ రంగంలో విద్యార్థులకు లభించే ఉద్యోగాలు గురించి తెలియజేశారు. కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు నాలుగేళ్లలో ఏ మార్గాన్ని ఎంచుకోవాలో నిర్ణయించుకునే సమయమన్నారు. మార్కెట్‌లో ఉద్యోగ అవకాశాలు రోజు రోజుకు మారుతున్నాయని, ఇందుకు అనుగుణంగా టెక్నాలజీ, ఏఐ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి విభాగాలు నూతన అవకాశాలు వస్తున్నాయన్నారు.

పాత్రికేయుల సమస్యలు పరిష్కరించాలి



నందలూరు : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు



రాజంపేట రూరల్: సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పాత్రికేయులు

గాలివీడు : రాష్ట్రంలోని పాత్రికేయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో గాలివీడు మండల పాత్రికేయులు తహసీల్దార్ భాగ్యలతను కలసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో భాగంగా జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, ఇళ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని నిలబెట్టుకోవాలన్నారు. పాత అక్రిడేషన్ల గడువు ఇక పొడిగించకుండా పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ కొత్త అక్రిడేషన్లు వెంటనే ఇవ్వాలని కోరారు. విశ్రాంత పాత్రికేయులకు ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పాత్రికేయ పింఛన్ పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, విశ్వనాథరెడ్డి, రమేష్, రెడ్డి రిషికేష్ తదితరులు పాల్గొన్నారు.

నందలూరు : అక్రిడేషన్ల గడువు పొడిగించకుండా రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ కొత్త అక్రిడేషన్లు వెంటనే ఇవ్వాలని ఏపీయూడబ్ల్యూజే రాజంపేట తాలూకా ప్రధాన కార్యదర్శి బాలాజీ శివశంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ పిలుపు తహసీల్దార్ అమరేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా స్థాయి, అక్రిడేషన్ కమిటీల్లో జర్నలిస్టుల యూనియన్లకు ప్రాతినిధ్యం వహించాలని అన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీం మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలని కోరారు. వర్కింగ్ జర్నలిస్టుల ప్రమాద బీమా పథకాన్ని తక్షణం పునరుద్ధరించాలని తెలిపారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న కూటమి ఎన్నికల హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

రాజంపేట రూరల్: అక్రిడేషన్‌లను రెన్యువల్ చేయకుండా అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకు నూతన అక్రిడేషన్‌లను మంజూరు చేయాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు బచోటి భాస్కర్, తాలుకా అధ్యక్షులు ఇండ్లూరి చిన్న వేంకటరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఏఓ బీ.శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి పెద్ద పీట వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాలుకా యూనియన్ గౌరవ అధ్యక్షులు మలిశెట్టి సుబ్బనరసింహులు, ఎస్. కళాంజలీ, సీనియర్ జర్నలిస్ట్ గుర్రంకొండ త్రివిక్రమ్, ఉపాధ్యక్షులు తేజం రవిచంద్రప్రసాద్, శివయ్య నాయుడు, రాజంపేట ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మందా శివయ్య, కోశాధికారి బాలిపోగు సునీల్, కార్యనిర్వాహకులు ఉదయగిరి కల్యాణ్, మండ్ల శ్రీహరీ, చామంచి వెంకటసుబ్బయ్య, బూర్సు నాగేంద్ర ప్రసాద్, చౌడవరం నరసింహులు, కొమ్మినేని మధుసూదన్, శివ, అనీల్, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయాలి

సుండుపల్లె : జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని ఏపీయూడబ్ల్యూజే సభ్యులు కోరారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ మధుకు వినతిపత్రాన్ని అందజేశారు. జర్నలిస్టుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ నూతన అక్రిడేషన్లు మంజూరు చేయాలన్నారు. పాత్రికేయుల సంక్షేమానికి పెద్దపీట వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి చందు, మండల అధ్యక్షుడు తిరుపాల్‌నాయక్, ప్రధాన కార్యదర్శి భూపయ్య, మండల కోశాధికారి గోపాల్, సభ్యులు కర్ణ, హరిబాబు, రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.